# సాక్షి తూర్పుగోదావరి

శనివారం । 18 । జనవరి । 2025






## బడులను కోడిపందేల బరులుగా మార్చారు

కూటమి ప్రభుత్వం బడులను కోడిపందేల బరులుగా మార్చేసిందని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆరోపించారు.


II లో



## బంగారం కోసం ప్రాణం తీశారా..?

రామచంద్రపురం మండలం తోటపేటకు చెందిన దామిశెట్టి మహాలక్ష్మి (52) ఈ నెల 11న మృతి చెందింది. బంగారం కోసం ఆమె ప్రాణాలు తీసినట్లు అనుమానిస్తున్నారు.

## డెల్టాకు 9,745 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 9,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

## న్యూస్‌రీల్

### డీఆర్‌పీగా ఉపాధి అవకాశాలు

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్)లో డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ (డీఆర్‌పీ)గా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు డీఆర్‌డీఏ, సెర్ప్ ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్‌ఎంఈ)ని సమర్థంగా అమలు చేసేందుకు మండల స్థాయిలో రిసోర్స్ పర్సన్‌లను ఎంపిక చేస్తామన్నారు. ఏదైనా డిగ్రీ చదివి, కంప్యూటర్, ఇంటర్నెట్ వినియోగంలో ప్రావీణ్యం ఉండి, సొంత స్మార్ట్‌ఫోన్ కలిగి, ప్రయాణాలు చేయడంలో ఆసక్తి ఉన్న పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు అర్హులని పేర్కొన్నారు. 21 నుంచి 30 సంవత్సరాలలోపు వయస్సు కల్గి ఉండాలన్నారు. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా డీఆర్‌పీలను ఎంపిక చేస్తామన్నారు. ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 23వ తేదీ గురువారం బొమ్మూరులోని నేక్‌స్కిల్‌కాలేజీలో రాతపరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. గ్రౌండింగ్ చేసిన యూనిట్ల ప్రాతిపదికన ఒక్కొక్క యూనిట్‌కు రూ.20,000 చెల్లింపు పూర్తిగా ప్రోత్సాహక ప్రాతిపదిక ఇన్సెంటివ్ ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు 89198 68419, 90309 24569, 99635 90429 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### రెవెన్యూ సేవలో జవాబుదారీతనం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రెవెన్యూ సేవలు అందించే క్రమంలో అధికారులు జవాబుదారీతనం కలిగి ఉండాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారులతో కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తితో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడంలో భాగంగా ఎక్కువ మొత్తంలో రెవెన్యూ పరమైన అంశాలపై అర్జీలను స్వీకరించడం, పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టాల్సింది ఉందన్నారు. వీటిలో ఎక్కువగా ఐదు కేటగిరిలకి చెందిన అర్జీలు ఉన్నాయన్నారు. జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం వచ్చే వారితో ఆప్యాయతతో వ్యవహరిస్తే పరిపాలన యంత్రాంగంపై గౌరవం కలిగే అవకాశం ఉంటుందన్నారు. ఆర్డీవో అధ్వర్యంలో మండలాల వారీగా ఫిర్యాదులు పరిష్కార విధానంపై ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.

**పథకాలు ప్రతిబింబించేలా శకటాల ప్రదర్శన**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలను ప్రదర్శించేలా గణతంత్ర వేడుకలను నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఆరు నెలల కాలంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల సమాహారంగా గణతంత్ర దినోత్సవ శకటాల ప్రదర్శన, స్టాల్స్ ప్రదర్శన ఉండాలన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాల ఆకర్షణీయంగా, దేశ భక్తి, గణతంత్ర దినోత్సవ స్ఫూర్తి దాయకంగా నిలిచేలా ప్రదర్శనలు ఉండాలనీ స్పష్టం చేశారు.

# ఎన్టీఆర్ చోద్యసేవ!

- పథకం నిర్వీర్యానికి కూటమి ప్రభుత్వం కుట్ర
- ఇప్పటికే ఈహెచ్ఎస్ సేవలు నిలిపివేత
- జిల్లాలో రూ.80 కోట్ల మేర పేరుకు పోయిన ఎన్‌టీఆర్ వైద్యసేవ బిల్లులు
- చికిత్స అందించేందుకు ముందుకురాని ఆస్పత్రులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పథకం సక్రమంగా అమలు

సాక్షి, రాజమహేంద్రవరం: పేదలకు ఆధునిక, కార్పొరేట్ వైద్యం, శస్త్ర చికిత్సలు ఉచితంగా అందించాలనే తలంపుతో అమలవుతున్న పథకంపై కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. ఇప్పటికే ఆరోగ్యశ్రీని ఎన్టీఆర్ వైద్య సేవగా పేరు మార్పు చేసింది. తాజాగా పథకాన్ని నిర్వీర్యం చేసి హెల్త్ ఇన్సూరెన్స్ పద్ధతిని తీసుకువచ్చే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఉద్దేశ పూర్వకంగానే ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆస్పత్రులకు అందాల్సిన బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిణామం నిరుపేదలకు ఇబ్బందిగా మారుతోంది. తాము రూ.లక్షలు వెచ్చించి వైద్యం చేయించుకోవాలంటే ఎలాగన్న ప్రశ్న తలెత్తుతోంది.

**రూ.80 కోట్ల బకాయిలు**

తెల్ల రేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవ వర్తింప చేస్తోంది. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే క్రమంలో జిల్లా వ్యాప్తంగా 90 ఆస్పత్రులను ఎంపిక చేసింది. అందులో ప్రైవేటు ఆస్పత్రులు 40 ఉండగా.. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు 5, ప్రైమరీ హెల్త్ సెంటర్లు 28, జీజీహెచ్ 1, ఏరియా హాస్పిటల్ 1, మరో 3 ఎంపిక ప్రక్రియలో ఉన్నాయి. 16 దంత వైద్యశాలలు(ఈహెచ్ఎస్) సైతం వైద్య సేవలు అందిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆస్పత్రులకు బిల్లులను చెల్లించకుండా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తూ వస్తోంది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు సుమారుగా రూ.80 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ పరిణామం ఆస్పత్రుల యాజమాన్యాలకు గుదిబండగా మారింది. ఎన్టీఆర్ వైద్యసేవ కేసులంటేనే ఎందుకులే అన్న భావన కలుగుతోంది. గుండె సంబంధిత, చర్మం, ఈఎన్‌టీ, గ్యాస్ట్రో, జనరల్ మెడిసిన్, సర్జరీ, మూత్రపిండ శస్త్ర చికిత్సలు తదితర ఆపరేషన్లు చేసిన ఆస్పత్రులకు బిల్లులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో జరిగిన వైద్యానికి ఎలాంటి చెల్లింపులూ చేపట్టలేదు. ఈ పరిణామం పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఖరీదైన శస్త్ర చికిత్స తాము ఎలా చేయించుకోవాలంటూ నిట్టూరుస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఈహెచ్ఎస్ సేవలు ఆగిపోయాయి. ఇలాంటి సందర్భంలో ఎన్టీఆర్ వైద్య సేవలు సక్రమంగా అందకపోతే తమ పరిస్థితేంటన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది.



రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులు(ఫైల్)

**జిల్లాలో గత ప్రభుత్వంలో వెచ్చించిన మొత్తం.. వివరాలు ఇలా..**

| సంవత్సరం | వైద్యం, శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు | వెచ్చించిన మొత్తం (రూ.కోట్లల్లో) |
|---|---|---|
| 2019-2020 | 25,750 | 62.71 |
| 2020-2021 | 29,602 | 62.15 |
| 2021-2022 | 47,039 | 89.48 |
| 2022-2023 | 1,46,414 | 294.15 |





వైఎస్సార్ సీపీ హయాంలో సేవలందించిన 104, 108 వాహనం

**బీమాగా మార్చే యోచన?**

ఎన్టీఆర్ పథకాన్ని మార్పు చేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం బాధ్యతల్ని ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టేందుకు పావులు కదుపుతోంది. ప్రస్తుతం అమలవుతున్న ఎన్టీఆర్ వైద్య సేవలో ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల మేర హెల్త్ కవరేజ్ లభిస్తోంది. ఈ విధానాన్ని బీమాలోకి తీసుకువస్తే.. బీమా క్లెయిమ్‌ల విషయంలో ఏ మేరకు లబ్ధి చేకూరుతుందన్న ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతోంది.

**గతంలో ఊపిరి**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టిన ఆరోగ్యశ్రీ పథకానికి తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక 938 వ్యాధులతో ప్రారంభమైన పథకంలో 3,275 వ్యాధుల వరకు విస్తరించారు. ఆస్పత్రుల్లో మార్గదర్శకాలు సైతం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశాలిచ్చారు. ఆస్పత్రుల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండాలి. డ్యూటీ డాక్టర్, స్పెషలిస్టు వైద్యులతో పాటు నర్సు, పారా మెడికల్ సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇచ్చారు. రోగులకు నాణ్యమైన మందులు, పౌష్టికాహారం అందేలా చూశారు. ఆరోగ్యమిత్రతో కూడిన హెల్ప్‌డెస్క్ తప్పనిసరిగా ఏర్పాటు చేశారు. ఆరోగ్యశ్రీ పరిధిలోని వ్యాధులకు చికిత్సను నిరాకరిస్తే ఆయా నెట్‌వర్క్ ఆస్పత్రులపై చర్యలు తీసుకునేలా ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం ఇలాంటివేమీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు.

**రూ.508.49 కోట్లు వెచ్చింపు**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక పథకం అమలుకు భారీగా ఖర్చు చేసింది. రూ.508.49 కోట్లు వైద్యం, శస్త్రచికిత్సలకు వెచ్చించింది. 2,48,805 మందికి వైద్యం అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసింది. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం స్కీం వర్తింపచేసింది. గుండె, లివర్ ప్లాంటేషన్, క్యాన్సర్ వంటి ఖరీదైన శస్త్ర చికిత్సలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది.

**ఖరీదైన వ్యాధులకు నిధులు**

మాజీ సీఎం వైఎస్ జగన్ చేపట్టిన సంస్కరణలతో ఖరీదైన వ్యాధులకు సైతం చికిత్స చేయించే వెసులుబాటు కలిగింది. బైలాట్రల్ కాక్లియర్ ఇంప్లాంటేషన్‌కు రూ.11.97 లక్షలు, ఆల్లోజెనిక్ బోన్‌మ్యారో స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ రూ.11 లక్షలు, గుండె మార్పిడి రూ.10.77 లక్షలు వెచ్చిస్తున్నారు. ఇలాంటి వ్యాధులు సైతం ఆరోగ్యశ్రీలో నయా పైసా చెల్లించకుండా చికిత్స చేయించే వెసులుబాటు కలిగింది.

ఎన్టీఆర్ వైద్య సేవ లోగో

## పకడ్బందీగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్

– కలెక్టర్ ప్రశాంతి సూచనలు



రాజమహేంద్రవరం రూరల్: ఈ నెల 18 నుంచి చేపట్టనున్న స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యాచరణ ప్రణాళిక పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ జరిగిన సమావేశంలో జిల్లాలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం అమలుపై మునిసిపల్, పంచాయతీ అధికారులకు కలెక్టరు సూచనలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్‌గా పాటించాలని నిర్ణయించినట్టు తెలిపారు. థీమ్‌జి జనవరి, 2025 ''కొత్త సంవత్సరం-క్లీన్ స్టార్ట్'' ప్రారంభించామన్నారు. ఇందులో భాగంగా ''దైవభక్తి పక్కన పరిశుభ్రత'' నినాదంతో ప్రతి ఒక్కరిని పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు చేసి బహిరంగంగా చెత్త వేసే అలవాటును అరికట్టడంతో పాటు సామూహిక క్లీనింగ్ డ్రైవ్‌ల ద్వారా చెత్త, చెదారం తొలగింపు, పరిసరాలను శుభ్రపరచడం శిథిలాల తొలగింపు, బహిరంగ ప్రదేశాలు, బస్టాప్‌లు, మొదలైన వాటిలో మూసుకుపోయిన కాలువలను డ్రైయిన్‌లలో పూడిక తీత పనులు చేపట్టడం ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛ్ దివస్ కార్యక్రమాలు ఎప్పటికప్పుడు సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలన్నారు. గ్రామ, మండల పంచాయతీ స్థాయి అధికారులు తొలగించిన చెత్త రవాణాకు వాహనాలు, అవసరమైన యంత్రాలు దాతల సహకారంతో సమకూర్చుకునేలా కృషి చేయాలన్నారు. ఇతర గ్రామ పంచాయితీల పారిశుధ్య సిబ్బందిని చెత్త కుప్పల తొలగింపునకు వినియోగించుకోవాలన్నారు. పారిశుధ్య పని ప్రారంభించే ముందు, చెత్తను తొలగించిన అనంతరం వివిధ కోణాలలో ఫొటోలు తీసి పీపీటీ, డాక్యుమెంటరీ రూపొందించాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలలో, స్కూల్స్ ప్రాంగణాలలో నిర్వహించి పచ్చదనం పరిశుభ్రతలో అధిక ప్రాధాన్యతనిచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. ఇన్‌చార్జి జిల్లా గ్రామ పంచాయితీ అధికారి ఎం.నాగలత, ఆర్‌ఎస్‌ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, వైద్య అధికారి వి.వినూత్న, అధికారులు పాల్గొన్నారు.

## అయినవిల్లి.. భక్తులతో శోభిల్లి



అయినవిల్లిలో లక్ష్మీగణపతి హోమ పూజల్లో భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం భక్తులతో శోభిల్లింది.. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో రద్దీ నెలకొంది. శుక్రవారం ఒక్కరోజే ఆలయానికి వివిధ పూజా టిక్కెట్లు, ప్రసాదాలు, అన్నదాన విరాళాలుగా రూ.5,02,435 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. తొలుత ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పంచామృత అభిషేకాల్లో ఇద్దరు, లఘున్యాస అభిషేకాల్లో 121 మంది, స్వామి పరోక్ష అభిషేకాల్లో ముగ్గురు, గరిక పూజలో ఒకరు, ఉండ్రాళ్ల పూజలో ఐదుగురు, స్వామివారి శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 71 మంది దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఇద్దరు చిన్నారులకు అన్నప్రాసన, ఏడుగురు చిన్నారులకు తులాభారం నిర్వహించారు. 24 మంది నూతన వాహన పూజలు చేయించుకోగా 6,310 మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఇదిలా ఉంటే సంకటహర చతుర్థి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లచెరువు వేంకటేశ్వర స్వామివారి ఆలయంలోనూ పూజలు జరిగాయి.

# సత్యదేవునికి జన్మ నక్షత్ర పూజలు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా శుక్రవారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ దేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున రెండు గంటలకు స్వామివారి ఆలయం తెరిచి స్వామి, అమ్మవార్లకు అర్చకస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సత్యదేవుడు, అమ్మవార్ల మూలవిరాట్‌లకు, శివ లింగానికి పండితులు పంచామృతాలతో మహాన్యాస పూర్వక అభిషేకం నిర్వహించారు. అభిషేకం అనంతరం సుగంధ భరిత పుష్పాలతో, స్వర్ణాభరణాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి పూజించారు. అనంతరం ఉదయం ఆరు గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు.

**ఘనంగా ఆయుష్యహోమం**

స్వామివారి యాగశాలలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు ఆయుష్యహోమం ఘనంగా నిర్వహించారు. 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. వేదపండితులు గొల్లపల్లి గణపతి ఘనాపాఠి, అర్చకులు బులుసు శర్మ, వ్రత పురోహితుడు పాలంకి పట్టాభి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**సత్యదేవుని దర్శించిన 40 వేల మంది భక్తులు**

సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. సత్యదేవుని దర్శించిన అనంతరం భక్తులు గోశాలలో సప్తగోవులను దర్శించి పూజలు చేశారు. అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. సత్యదేవుని వ్రతాలు రెండు వేలు నిర్వహించగా అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.35 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మందికి భోజనం పెట్టారు.



సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా ఆయుష్యహోమం నిర్వహిస్తున్న పండితులు

# కుర్చీ కోసం ఖర్చీఫ్‌లు



- వీసీ పోస్టులకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్న ఆశావహులు
- రాజకీయ చక్రబంధంలో వర్సిటీలు
- జేఎన్‌టీయూకే కోసం తెలంగాణ ప్రొఫెసర్ యత్నాలు
- నన్నయ పీఠానికి మహిళా ప్రొఫెసర్ పోటీ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: విశ్వవిద్యాలయాలు రాజకీయ చక్రబంధంలో అల్లాడి పోతున్నాయి. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్‌కు దిశానిర్దేశం చేసే విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్సలర్‌ల నియామకానికి సంబంధించిన పీటముడి వీడటం లేదు. పనితీరు, నైపుణ్యంతో ప్రమేయం లేకుండా రాజకీయ పలుకుబడి, ధనబలం ఉన్న వారికే ఈ పోస్టులు కట్టబెట్టే ప్రయత్నాలు ఉన్నత స్థాయిలో జరుగుతున్నాయి. రాష్ట్రంలో చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడు నెలలు కావస్తున్నా జేఎన్‌టీయూ కాకినాడ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాలకు ఉప కులపతి నియామకంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో దూరదృష్టితో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జేఎన్‌టీయూ, రాజానగరంలో ఆదికవి నన్నయ వర్సిటీలను స్థాపించారు. ఈ రెండు ప్రాంతాల్లో రెండు వర్సిటీలకు అంకురార్పణ చేసి ఉన్నత విద్యాభివృద్ధికి బాటలు వేశారు.

**రాజకీయాలు చొప్పించిన కూటమి సర్కారు**

ప్రారంభంలో ఎనిమిది జిల్లాల పరిధిలో కాకినాడ వర్సిటీ ఏర్పాటైంది. 160 ఇంజినీరింగ్ కాలేజీల ద్వారా ఏటా సుమారు 45వేల మంది విద్యార్థుల భవిష్యత్తుకు మార్గం చూపించింది జేఎన్‌టీయూ కాకినాడ. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ వర్సిటీకి వీసీ నియామకాన్ని త్వరితగతిన చేపట్టాలని మేధావి వర్గం సూచిస్తోంది. ఈ రెండు వర్సిటీల వీసీలను కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన రోజుల వ్యవధిలోనే అర్ధంతరంగా ఇంటికి పంపించేసింది. విశ్వవిద్యాలయాల్లో రాజకీయాలు చొప్పించడం సహేతుకం కాదనే మేధావి వర్గం అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోకుండా కేవలం గత ప్రభుత్వ హయాంలో నియమితులయ్యారనే ఏకైక కారణంతో ఇద్దరు వీసీలను తప్పించింది. వాస్తవానికి జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ వీసీ పదవీ కాలం ఆరు నెలలు, నన్నయ్య వర్సిటీ వీసీ పదవీకాలం రెండేళ్లు మిగిలి ఉండగానే కూటమి ప్రభుత్వం అర్ధంతరంగా రాజీనామా చేయించింది. అలాగని ఎక్కడా అధికారిక ఉత్తర్వులు లేకుండా మౌఖిక ఆదేశాలతోనే ఈ రాజీనామాలు చేయించింది. ఇదంతా ప్రభుత్వం గద్దె నెక్కి పట్టుమని 10 రోజులు కూడా గడవకుండానే జరిపించేసి తమ భవిష్యత్‌ను దెబ్బతీసిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరు వీసీలు రాజీనామా చేసి ఇంచుమించు ఏడు నెలలు కావస్తున్నా రెండు వర్సిటీలు ఇన్‌చార్జ్ వీసీలతోనే కాలక్షేపం చేస్తున్నాయి.


**నియామకం ఇలా..**

గత డిసెంబర్‌లో రెండు వర్సిటీల పాలకమండళ్ల అత్యవసర భేటీలో వీసీల నియామకాల కోసం చర్చించారు. సెర్చ్ కమిటీలో ఉండే ముగ్గురు విద్యావేత్తలలో విశ్వవిద్యాలయాల పాలకమండలి ఒక అభ్యర్థిని ఎంపిక చేస్తుంది. యూజీసీ ఒక విద్యావేత్తను, ప్రభుత్వం మరో అభ్యర్థిని నియమిస్తుంది. సెర్చ్ కమిటీలు దరఖాస్తులు పరిశీలన చేసి మూడు పేర్లతో జాబితా రూపొందిస్తే ఒకరి పేరును వీసీగా గవర్నర్ ఖరారు చేస్తారు.

**ఎవరి ప్రయత్నాలు వారివే...**

ప్రస్తుత ఇన్‌చార్జిలుగా చేస్తున్న వారితో పాటు గతంలో రిజిస్ట్రార్‌లు, డైరెక్టర్‌లుగా పనిచేసిన వారితో పాటు ప్రస్తుత డైరెక్టర్లు కూడా ఈ సీటు ఆశిస్తున్నారు. వీసీల కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులు సామాజిక, ఆర్థిక అంశాల ప్రాతిపదికన జరుగుతోన్న ప్రయత్నాలు అటు జేఎన్‌టీయూకే, ఇటు ఆదికవినన్నయ్య వర్సిటీలో హాట్‌టాపిక్‌గా మారాయి. జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ మురళీకృష్ణ, ఆదికవి నన్నయ్య వర్సిటీకి జియాలజీ ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు ప్రస్తుతం ఇన్‌చార్జి వీసీలుగా కొనసాగుతున్నారు. వీరితో పాటు పలువురు వీసీ పోస్టు ఆశిస్తూ ఆ మేరకు ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. ఈ నెలాఖరు నాటికి ఈ ప్రక్రియ పూర్తి అవుతుందంటున్నారు.


### వీసీలను త్వరగా నియమించాలి



గత వీసీలకు ఇంకా సమయం ఉన్నా అర్ధంతరంగా తొలగించి ఇన్‌చార్జి వీసీలను నియమించారు. విశ్వవిద్యాలయాలను ఆరు నెలలుగా ఇన్‌చార్జ్ వీసీల పాలనలోనే నడుపుతున్నారు. వైస్ చాన్సలర్‌లను త్వరగా నియమిచాలి. ఇన్‌చార్జ్‌లు ఉండడంతో కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉండదు. ఈ కారణంగా విద్యావ్యస్థకు నష్టం జరిగే పరిస్థితి ఉంది.

– ఎం.గంగా సూరిబాబు, ఎస్‌ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి, కాకినాడ

### ఇన్‌చార్జిలు చురుకుగా నిర్ణయాలు తీసుకోలేరు



యూనివర్సిటీల నిర్వహణలో ఫుల్‌చార్జి వైస్ చాన్సలర్లను నియమించాల్సిన ప్రభుత్వం ఇన్‌చార్జిలతో కాలం గడపడం సహేతుకం కాదు. ఇన్‌చార్జిలు ఎవరైనా సరే ఆయా యూనివర్సిటీలకు సంబంధించిన కొన్ని నిర్ణయాలు తీసుకోవడంలో చురుకైన పాత్ర నిర్వర్తించలేరు. అదే ఫుల్‌చార్జ్ వైస్ చాన్సలర్ ఉంటే అవసరం అనుకుంటే గవర్నర్ వద్దకు నేరుగా వెళ్లి యూనివర్సిటీ కోసం మాట్లాడే అవకాశం ఉంటుంది. వెంటనే ఫుల్‌చార్జ్ వీసీలను నియమించాలి.

– అశోక్‌కుమార్, డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తూర్పుగోదావరిజిల్లా

### సెర్చ్ కమిటీలతో కాలయాపన

పూర్తి స్థాయి వీసీలు నియామకంలో జరుగుతోన్న జాప్యం రెండు వర్సిటీల అభివృద్ధిపై ప్రభావం చూపిస్తోందంటున్నారు. ఇదే విషయమై పదేపదే విద్యార్థులు మొత్తుకుంటున్నా సెర్చ్ కమిటీ అంటూ సర్కార్ కాలయాపన చేస్తోందనే విమర్శలున్నాయి. వీసీ పీఠం కోసం ఖర్చుకు వెనుకాడకుండా పై స్థాయిలో కొందరు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. జేఎన్‌టీయూ కాకినాడ కుర్చీ కోసం రూ. రెండు, మూడు కోట్లకు వెనుకాడటం లేదని వర్సిటీలో ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. సెర్చ్ కమిటీకి 30 మంది వరకు దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికే తెలంగాణ ప్రాంతానికి చెందిన ఒక వర్సిటీ ప్రొఫెసర్ ఈ పోస్టు కోసం మాట్లాడుకున్నారని వినిపిస్తోంది. ఇందుకు పొరుగు రాష్ట్రంలో అధికార పార్టీకి చెందిన ఒక ప్రజాప్రతినిధి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో చినబాబుతో మంతనాలు సాగిస్తున్నారని సమాచారం. ఆదికవి నన్నయ్య వీసీ కుర్చీ కోసం కృష్ణా, గుంటూరు ప్రాంతానికి చెందిన ఒక మహిళా ప్రొఫెసర్ ప్రయత్నాలు చేస్తున్నారని తెలియవచ్చింది. కూటమి సర్కార్‌లో కొందరు పెద్దలతో ఉన్న పరిచయాలతో ఆమె ఈ పోస్టు కోసం ఉన్నత స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నారంటున్నారు. వర్సిటీ వర్గాల్లో జరుగుతోన్న చర్చను బట్టి సెర్చ్ కమిటీలు వీసీల నియామకానికి ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకోవడానికే పరిమితమయ్యాయి.

## క్లుప్తంగా

### పరిపాలనాధికారులుగా పదోన్నతి



సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి ఉత్తర్వులు ఇస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పని చేస్తున్న ఏడుగురు సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనాధికారులుగా పదోన్నతి కల్పిస్తూ జెడ్పీ చైర్పర్సన్ విప్పర్తి వేణుగోపాలరావు శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వీరు మండల పరిషత్ పరిపాలనాధికారులుగా పదోన్నతి పొందినట్లు ఆయన తెలిపారు. మండల పరిషత్ స్థాయిలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములై చురుకైన పాత్ర వహించి, ఆయా మండల పరిషత్‌ల అభివృద్ధికి పాటు పడాలని వేణుగోపాలరావు కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని పరిపాలనాధికారుల ఖాళీలను భర్తీ చేసినట్లు ముఖ్య కార్యనిర్వహణాధికారి వీవీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. పదోన్నతి పొందిన వారిని జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి జీఎస్ రామ్‌గోపాల్ తదితరులు అభినందించారు.

### చెదల మందు తాగిన వ్యక్తి మృతి

కరప: సీసాలో ఉన్న చెదల మందును మద్యం అనుకుని తాగిన వ్యక్తి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కరప పోలీసుల కథనం ప్రకారం.. నడకుదురు గ్రామానికి చెందిన వాసంశెట్టి నాగేశ్వరరావు (60) ఈ నెల 11న సాయంత్రం అదే గ్రామంలో నివాసముంటున్న తన పెద్ద కుమార్తె చీకట్ల రమణమ్మ ఇంటికి వెళ్లాడు. అక్కడ మద్యం సీసాలో ఉన్న చెదల మందును చూసి, తాగిన మత్తులో అది మద్యం అనుకుని తాగేశాడు. నాగేశ్వరరావు వాంతులు చేసుకుంటుండగా అతని భార్య పార్వతి చూసి, జరిగిన విషయం తెలుసుకుని, చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్‌ఐ టి.సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## దోపిడీ చేసిన నలుగురికి జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బెదిరింపులకు పాల్పడి, సెల్ ఫోన్లను దోపిడీ చేసిన కేసులో నలుగురికి రెండేళ్ల జైలు, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ 5వ అదనపు సెషన్స్ జడ్జి డి.వి జయ గౌతమ్ శుక్రవారం తీర్పునిచ్చారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా జి.మాడుగుల మండలం వీరవల్లి అగ్రహారానికి చెందిన తలారి రమణ, తలారి రామన్న దొర తమ నానమ్మ అస్థికలను గోదావరిలో నిమజ్జనం చేసేందుకు 2021 మార్చి 17న అర్ధరాత్రి రైలు దిగి పుష్కర ఘాట్‌కు చేరుకున్నారు. పుష్కరాల రేవులో కృష్ణుడు బొమ్మ దగ్గర రైల్వే బ్రిడ్జి కింద పడుకున్నారు. రాత్రి మూడు గంటల నలుగురు యువకులు అక్కడకు వచ్చి, వారిని కత్తితో బెదిరించారు. సెల్ ఫోన్లను లాక్కొని, వాటిని తిరిగి ఇవ్వాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బయపడిన తలారి రమణ, రామన్న దొర గట్టిగా కేకలు వేశారు. దీంతో ఆ యువకులు పరారయ్యారు.

**బాధితుల ఫిర్యాదు :** బాధితుల ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి ఇన్‌స్పెక్టర్ కె.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దోపిడీకి పాల్పడిన లింగంపేట వాంబే అపార్ట్‌మెంట్‌కు చెందిన కోసిరెడ్డి ప్రేమ్ కుమార్, శానిటోరియం సంతోష్ నగర్‌కు చెందిన మోరంపూడి తిరుమల ప్రసాద్, బొమ్మూరు వెంకటగిరి కొండకు చెందిన వీధి నాని, సోమాలమ్మ గుడి ప్రాంతంలోని మెరక వీధికి చెందిన ఉగ్రజా అర్జున్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ పంపారు. ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ వి.అప్పారావు కేసును పర్యవేక్షించారు. న్యాయస్థానంలో సాక్షులను ప్రవేశ పెట్టడంలో ఏఎస్సై జి.వెంకటేశ్వర్లు సహకరించారు. బాధితుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.లక్ష్మణ్ నాయక్ వాదించారు. అనంతరం న్యాయమూర్తి నిందితులకు పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కేసు దర్యాప్తులో సాక్షులను ప్రవేశపెట్టి, నేరస్తులకు జైలు శిక్ష పడేలా చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

# బడులను కోడిపందేల బరులుగా మార్చారు

- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కోడిపందేలు, పేకాట, గుండాటలు
- సీఎం చంద్రబాబువి డైవర్షన్ పాలిటిక్స్
- రాజానగరం నియోజకవర్గంలో బరుల పేరిట ఎమ్మెల్యే కలెక్షన్ రూ.10 కోట్లు
- పవన్ కళ్యాణ్‌కు చిత్తశుద్ధి ఉంటే ఆ ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలి
- పేపరు మిల్లు కార్మికులకు అన్యాయం చేసిన ప్రవీణ్‌చౌదరి
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న జక్కంపూడి రాజా

సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాలలను సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దితే కూటమి ప్రభుత్వం మాత్రం బడులను కోడిపందేల బరులుగా మార్చేసిందని, సంక్రాంతి పండగకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2 వేల బరులు ఏర్పాటు చేస్తే.. అందులో 400చోట్ల బడులను కేంద్రంగా చేసుకుని జూదాలు నడిపారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆరోపించారు. ఆయన శుక్రవారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా రాష్ట్రంలో మద్యం ఏరులై పారిందని, చరిత్రలో ఎన్నడూలేని విధంగా రూ.400 కోట్లు మద్యం అమ్మకాలు జరిగినట్లు టీడీపీకి కొమ్ముకాసే పత్రికలోనే వచ్చిందని రాజా ఆ పత్రిక వార్తను చదివి వినిపించారు. సంపద సృష్టి అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. బరుల దగ్గర పోలీసులను పక్కకు గెంటేయడం, తోసెయ్యడం చూస్తుంటే.. లా అండ్ ఆర్డర్ ఉందా..? అన్న అనుమానం కలుగుతోందన్నారు. సంక్రాంతి పండగకు కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూద శిబిరాలు ఏర్పాటు చేసి కూటమి నాయకులు ప్రజల నుంచి డబ్బులు దోచేశారన్నారు. గుండాటలో డబ్బులు పోగొట్టుకుని ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడితే, కోడిపందేల్లో డబ్బులు ఇవ్వలేదని మరో యువకుడు పీక కోసుకున్నాడని, ఇదేనా కూటమి పాలన అని నిలదీశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గడిచిన సాధారణ ఎన్నికల్లో కూడా ఇచ్చిన హామీలను ఏమాత్రం నెరవేర్చకుండా డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతోందని రాజా విమర్శించారు.

**హామీల అమలు లేదు..**

సీఎం చంద్రబాబు చెప్పేదానికి, చేసేదానికి పొంతన లేదని మరోసారి రుజువైందన్నారు. సూపర్ సిక్స్ అమలు, సంపద సృష్టిస్తామని, భవిష్యత్‌కు గ్యారంటీ అంటూ గొప్పలు చెప్పి.. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా ఏ ఒక్కటీ అమలు చేసిన పాపాన పోలేదన్నారు. అమ్మఒడి పథకంతో వచ్చిన డబ్బుతో పిల్లలకు దుస్తులు కొని, సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకునేవారన్నారు. ప్రజలకు పథకాలు అమలు చేయకపోవడంతో సామాన్య ప్రజలకు డబ్బులేకుండా పోయాయని, ఫలితంగా ఒకప్పుడు కళకళ లాడిన మార్కెట్లు ఇప్పుడు వెలవెల బోయాయన్నారు.

**రాజానగరం నియోజకవర్గంలో దందాలు**

రాజానగరం నియోజకవర్గంలో ఇసుక, మద్యం దందాలు పెరిగిపోయాయని, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సంక్రాంతి వసూళ్లు రూ.10 కోట్లని ఆరోపించారు. ఒక్కొక్క బరి నుంచి రూ.10 లక్షల నుంచి కోటి రూపాయల వరకు వేలం పెట్టి మరీ వసూలు చేసి దండుకున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఖర్చు పెట్టిన సొమ్ము వసూలు చేసుకోవాలి కదా..? అని ఆయన చెబుతున్నట్లు తెలుస్తోందని అన్నారు. రాజానగరంలో ఎన్నడూ లేనివిధంగా డ్రగ్స్, రేవ్ పార్టీలు, జూదాలు జరిగాయన్నారు. అనకాపల్లిలో పట్టుకున్న గంజాయి మూలాలు కాపవరంలో జనసేన నాయకుడు దగ్గర ఉన్నాయన్నారు. పెనమలూరులో బరుల దగ్గర జనసేన జెండాలు ప్రదర్శించారన్న సాకుతో ఒకరిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారని, పవన్ కళ్యాణ్‌కి నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రమంతా సాగిన బరుల వ్యవహారంలో టీడీపీ, జనసేన నేతలపై చర్యలు తీసుకోవాలన్నారు. రాజానగరం ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలని, కూటమి నుంచి బయటకు రావాలని డిమాండ్ చేశారు. పేపరుమిల్లు కార్మికులకు న్యాయం చేయాలని జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు. పేపర్ మిల్లు కార్మిక నేత ప్రవీణ్ చౌదరి ఒక బ్రోకర్ అని, గోరంట్ల బుచ్చయ్య చౌదరి డైరెక్షన్‌లో ప్రవీణ్ చౌదరి నడుస్తున్నట్లు చెప్పారు. కార్మికుల శ్రమతో రూ.కోట్ల లాభాలు గడిస్తున్న యాజమాన్యం వారి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చి తీరాలన్నారు.

## అంబాజీపేట కొబ్బరి మార్కెట్



| కొబ్బరి రకం | ధర (రూ.ల్లో) |
|---|---|
| కొత్తకొబ్బరి (క్వింటాల్) | 14,000 – 14,500 |
| కొత్తకొబ్బరి (రెండవ రకం) | 9,500 – 10,000 |
| **కురిడీ కొబ్బరి (పాతవి)** | |
| గండేరా (వెయ్యి) | 19,000 |
| గటగట (వెయ్యి) | 17,000 |
| **కురిడీ కొబ్బరి (కొత్తవి)** | |
| గండేరా (వెయ్యి) | 17,500 |
| గటగట (వెయ్యి) | 16,500 |
| నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి) | 15,000 – 15,500 |
| కొత్త (పచ్చి)కాయ (వెయ్యి) | 15,000 – 15,500 |
| కొబ్బరి నూనె (15 కిలోలు) | 3,750 |
| ఒక కిలో | 260 |

### నేత్రపర్వంగా అరుణాచలేశ్వరుని కల్యాణం



పీఠంలో అరుణాచలేశ్వరునికి అభిషేకాలు, అర్చనలు చేస్తున్న వేదపండితులు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో అరుణాచలేశ్వరుని కల్యాణం నేత్రపర్వంగా సాగింది. పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) 89వ జన్మదిన వేడుకల సందర్భంగా పీఠంలో వేడుకలను పీఠాధిపతి గాడ్ కుమార్తె సత్యవెంకట కామేశ్వరి ప్రారంభించారు. విజయదుర్గా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు గణపతి హోమం, గరిక పూజ, బిల్వపత్ర పూజ, నక్షత్ర జపం, నవగ్రహ పూజ, ఏకవార రుద్రాభిషేకంతో మహ మృత్యుంజయ హోమం, మన్యుసూక్త పారాయణ చేశారు. విజయదుర్గా అమ్మవారికి దుర్గాఅష్టోత్తర, సహస్ర నామావళి, దుర్గా ద్వాత్రింశ నామావళి, దేవీ శక్తిమాల అష్టోత్తరాలతో పూజించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు తమిళనాడు రాష్ట్రం అరుణాచల దేవస్థానం ప్రధాన అర్చకులచే అరుణాచలేశ్వరునికి ఆలయ సంప్రదాయంతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు అరుణాచలేశ్వరుని దివ్య కల్యాణం జరిపారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి అసోసియేట్ రీజినల్ కో ఆర్డినేటర్ కందర్ప హనుమాన్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు.

## హాకీ పోటీలకు చురుగ్గా ఏర్పాట్లు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ చాంపియన్ షిప్ పోటీలను కాకినాడలో నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ శుక్రవారం తెలిపారు. స్థానిక డీఎస్ఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పోటీల నిర్వహణా కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్ షణ్మోహన్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. వచ్చే నెల 15 నుంచి 28 వరకూ లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ పోటీలకు 30 రాష్ట్రాల నుంచి 40 జట్లు పాల్గొంటాయన్నారు. సుమారు వెయ్యి మంది క్రీడాకారులు, వంద మంది క్రీడాధికారులు హాజరవుతారని తెలిపారు. పోటీల నిర్వహణ నిమిత్తం హాకీ టర్ఫ్ కోర్టులో సౌకర్యాలు మెరుగు పరుస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ సహకారంతో పోటీలు జరుగుతాయన్నారు. సెంట్రల్, స్టేట్ సెక్రటేరియట్లు, రీజనల్ స్పోర్ట్స్ బోర్డు నుంచి జట్లు హాజరవుతాయని తెలిపారు. అర్జున అవార్డీ జర్మన్ ప్రీత్ సింగ్ ఈ పోటీల్లో పాల్గొంటుందన్నారు. సమావేశంలో డీఎస్‌డీఓతో పాటు కోకనాడ స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకుడు, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి రవిచంద్రప్రసాద్, అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడు దాసరి మురళీకృష్ణ, కోచ్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 2025–26వ ఏడాది ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం జరుగనున్న ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విద్యాలయ ఇన్‌చార్జి, ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆరో తరగతి ప్రవేశానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 37 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. కాకినాడ జిల్లాలో 14, తూర్పుగోదావరిలో ఏడు, కోనసీమ జిల్లాలో 16 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు మొత్తం 8,971 మంది హాజరు కానున్నారన్నారు.

శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ నిర్వహించే ఈ పరీక్షకు గంట ముందే విద్యార్థులు కేంద్రానికి చేరుకోవాలన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఎవరికైనా సందేహాలు ఉంటే 94410 08830, 94404 19142 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని రామకృష్ణయ్య కోరారు.

## నాటకం పల్లె పల్లెకూ చేరాలి



సమావేశంలో మాట్లాడుతున్న గొందేసి రాజా

పెద్దాపురం: నాటకం పల్లె పల్లెకు చేరాలని స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తొలిసారిగా నాటక కళా పరిషత్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్నేహ ఆర్ట్స్ నాటక కళా పరిషత్ అధ్యక్షుడు గొందేసి రాజా అన్నారు. పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి గ్రామంలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకూ పోటీలు జరుగుతాయన్నారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కళ.. కళ కోసం కాదని ప్రజలు, ప్రగతి కోసమన్నారు. నాటకం అనేది చాలా శక్తివంతమైందని, ప్రజా సమస్యలకు కారణాలు, వాటి పరిష్కార మార్గాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తుందన్నారు. ఈ నాటక పోటీలకు ప్రతి కళాభిమానులు హాజరై జయప్రదం చేయాలని రాజా కోరారు. సమావేశంలో కంటిబోయిన ప్రసాద్, మానేపల్లి రవీంద్ర, నూకలమంతి నానాజీ, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సత్తిబాబు, కేదారి నాగు, గొందేసి సత్యానందం, వెన్నా పండు, మాగాపు నాగు, పాలాని సత్తిబాబు, సమ్మెట గంగాధర్ పాల్గొన్నారు.

## వీఆర్వో ఆత్మహత్య



యార్లగడ్డ నాగ గంగరాజు (ఫైల్)

ఉండ్రాజవరం: అప్పుల బాధ తాళలేక ఓ వీఆర్వో ఉరి వేసుకుని ఆత్మహత్య చేస్తున్న సంఘటన ఉండ్రాజవరం మండలంలోని పాలంగి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై జి.శ్రీనివాసరావు కథనం ప్రకారం.. పాలంగి గ్రామానికి చెందిన యార్లగడ్డ నాగ గంగరాజు (41) శుక్రవారం తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గతంలో పాలంగి రెవెన్యూలో వీఆర్ఏగా పని చేసిన గంగరాజు ప్రస్తుతం పదోన్నతిపై తణుకు పట్టణం ఏడు వార్డు సచివాలయంలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల భార్య జీవనోపాధి నిమిత్తం ఖత్తర్ దేశం వెళ్లింది. పండగకు ఇద్దరు కుమారులు మోర్తలో ఉంటున్న వాళ్ల అమ్మమ్మ ఇంటికి వెళ్లడంతో ఎవరూ లేని సమయంలో నాగ గంగరాజు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పులు బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు, ఇందులో ఎవరి ప్రమేయం లేనట్లు మృతుడు లేఖ రాసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి పెద్ద కుమారుడు వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ వివరించారు.

## విద్యుదాఘాతానికి గడ్డి ట్రాక్టర్ దగ్ధం



అప్పలరాజుపేటలో కాలిపోతున్న గడ్డి, ట్రాక్టర్ ట్రక్కు

కోటనందూరు: విద్యుదాఘాతానికి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైన ఘటన కోటనందూరు మండలం అప్పలరాజుపేట గ్రామంలో శుక్రవారం జరిగింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై గడ్డితో పాటు ట్రక్కు, ఇంజిన్ వెనుక టైర్లు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ. 4 లక్షల ఆస్తి నష్టం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం మన్యపువురట్ల నుంచి కోటవురట్ల మండలం బొడ్డుపల్లికి వెళ్తున్న గడ్డి ట్రాక్టర్ మండలంలోని అప్పలరాజుపేట గ్రామంలోకి వచ్చింది. ఇటీవల కొత్తగా నిర్మించిన విద్యుత్ లైన్ వైర్ల కింద నుంచి వెళ్లడంతో వైర్లు ట్రాక్టర్‌పై గడ్డికి తగిలి నిప్పంటుకుంది. భయభ్రాంతులకు గురైన డ్రైవర్ ట్రాక్టర్‌ను గ్రామ శివారుకు తరలించారు. అప్పటికే గడ్డితో పాటు ట్రక్కు టైర్లకు నిప్పంటుకుని భారీగా మంటలు ఎగిసి పడి ట్రాక్టర్ డ్రైవర్ వీపు భాగం కొంతమేర కాలిపోగా ట్రక్కు, గడ్డి కాలిబూడిదైంది. హుటాహుటిన డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు.

**విద్యుత్ లైను ఏర్పాటులో నిర్లక్ష్యం**

24 గంటల విద్యుత్ పేరుతో పాత విద్యుత్ లైనుకు అనుసంధానంగా కొత్తగా స్తంభాలను వేసి లైను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో రోడ్ల ఎత్తు పెరిగి పాత విద్యుత్ లైను ఎత్తు తక్కువైంది. కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైను కూడా పాతలైను ఎత్తులోనే ఏర్పాటు చేయడంతో ఈ ప్రమాదం సంభవించింది.

## ఏడుగురికి ఫుడ్ పాయిజన్

పిఠాపురం: ఫుడ్ పాయిజన్ కారణంగా ఏడుగురు అస్వస్థతకు గురయ్యారు. పిఠాపురం మండలం బి.పత్తిపాడులో రెండు రోజుల నుంచి ఏడుగురు వాంతులు, విరోచనాలతో ఉండగా విరవ పీహెచ్‌సీ డాక్టర్ ఇందిర వైద్య చికిత్స చేశారు. అనంతరం ఆమె వైద్య సిబ్బందితో గ్రామంలో పర్యటించారు. ఫుడ్‌పాయిజన్ కారణంగానే అస్వస్థతకు గురయ్యారని గుర్తించామని, ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్ ఇందిర తెలిపారు.

## తిరుమలలో విజయవంతంగా అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం తిరుమల విద్యా సంస్థల ఆవరణలో 5 నుంచి 10వ తరగతి పూర్తి చేస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్, నీట్‌లపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. దీనికి సుమారు 14 వేల మంది హాజరైనట్లు తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో దేశ వ్యాప్తంగా జరిగే ఇంజినీరింగ్ (జేఈఈ మెయిన్ అండ్ అడ్వాన్స్) పరీక్షల్లో 30 మంది పరీక్ష రాస్తే కేవలం ఒక్కరికి మాత్రమే సీటు దొరుకుతుందని, అదే తిరుమలలో ప్రతి నలుగురిలో ఒకరికి సీటు లభిస్తుందన్నారు. మెడికల్‌లో దేశవ్యాప్తంగా జరిగే నీట్ పరీక్షల ప్రకారం 24 మంది పరీక్ష రాస్తే కేవలం ఒకరికి మాత్రమే సీటు లభిస్తుందని, అదే తిరుమలలో ఓ ప్రతి ముగ్గురిలో ఒకరికి మెడికల్ సీటు వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఎక్కువ సేపు ఆన్‌లైన్‌లో సోషల్ మీడియా చూస్తూ ఉంటూ మెదడును పనిచెయ్యకుండా చేయడమే బ్రెయిన్‌రాట్ అంటారని, దీని నుంచి బయట పడాలంటే పిల్లలను స్మార్ట్‌ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు దూరంగా ఉంచాలన్నారు. తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినీదేవి మాట్లాడుతూ పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. 2024లో ఢిల్లీలో ఎయిమ్స్‌లో సీటు సాధించిన పి.బేబిబిఅభిఘ్న తండ్రి పి.సన్యాసిరావు, ఐఐటీ హైదరాబాద్‌లో సీటు సాధించిన సంతోషిగాయత్రి, ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన మణికంఠ తల్లిదండ్రులు ఎం.రాజశేఖరం-శ్రీమలు పాల్గొని తిరుమల విద్యాసంస్థలో వారికున్న అనుభవాలను పంచుకున్నారు. సదస్సులో అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి పాల్గొన్నారు.

### ఆసుపత్రిలో తేరుకుంటున్న క్షతగాత్రులు

కాకినాడ రూరల్: ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి వద్ద గురువారం జరిగిన టెంపో ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు కోలుకుంటున్నారు. ఈ ప్రమాదంలో మొత్తం 28 మంది ఆసుపత్రిలో చేరారు. ఇందులో 8 మందికి తీవ్ర గాయాలు కాగా, ఇద్దరి పరిస్థితి ఇంకా విషమంగా ఉంది. కొందరికి శుక్రవారం సర్జరీలు చేశారు. కోలుకుంటున్న వారిని జనరల్ వార్డుకు మార్చారు. అత్యవసర సేవలు పొందుతున్న వారిని ఐసీయూలో ఉంచారు. క్షతగాత్రులను ఎమ్మెల్యే పంతం నానాజీ శుక్రవారం పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షలు తన వంతుగా ప్రకటించారు.

### వలసపాకలలో వ్యక్తి హత్య



మృతి చెందిన శ్రీను

కాకినాడ రూరల్: వలసపాకల గ్రామంలో ఈ నెల 12న ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఇందులో గాయపడిన గుబ్బల శ్రీను (34) చికిత్స పొందుతూ మృతి చెందడంతో సర్పవరం పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. సీఐ పెద్దిరాజు వివరాల ప్రకారం.. శ్రీను, అతని ఇంటి పక్కన నివాసం ఉండే కేశబోయిన రామదాసు గత ఆదివారం సాయంత్రం టెంట్లు వేస్తూ గొడవ పడ్డారు. ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో శ్రీను కడుపులో రామదాసు బలంగా తన్నాడు. మరుసటి రోజు సోమవారం రాత్రి కడుపునొప్పితో శ్రీను ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెండడంతో హత్య కేసు నమోదు చేశారు. మృతునికి భార్య జ్యోతి సాయిశ్రీ, పిల్లలు రేష్మశ్రీ, రేవంత్ ఉన్నారు. కోడి పందేల కోసం కాదని, గతంలో ఆరు నెలల కిందట జరిగిన గొడవ నేపథ్యంలో మళ్లీ తగవు పడ్డారని సీఐ చెప్పారు.

### కొనసాగుతున్న భక్తుల రద్దీ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని క్షేత్రంలో శుక్రవారం సంక్రాంతి పర్వదినాల రద్దీ యథావిధిగా కొనసాగింది. సుదూర ప్రాంతాల నుంచి వాహనాల్లో అత్యధిక సంఖ్యలో కూడా భక్తుల తరలి వచ్చారు. ఎటు చూసినా ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా మారింది. ఆలయంలో నిత్యం నిర్వహించే నారసింహ సుదర్శన హోమంలోను, విశేష అభిషేకంలోను భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల క్యూ లైన్లను, అన్నదాన పథకాన్ని ఏసీ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది పర్యవేక్షించారు.

# బంగారం కోసం ప్రాణం తీశారా..?

- మహిళ అనుమానాస్పద మృతిపై విచారణ
- ఐదు రోజుల తర్వాత సమాధి నుంచి తీసి పోస్టుమార్టం



దామిశెట్టి మహాలక్ష్మి (ఫైల్)



ద్రాక్షారామ శ్మశాన వాటికలో పోస్టుమార్టానికి ముందు సమాధి వద్ద తహసీల్దార్ సావిత్రి, ఎస్సై లక్ష్మణ్ తదితరులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం తోటపేట గ్రామానికి చెందిన దామిశెట్టి మహాలక్ష్మి (52) ఈ నెల 11న మృతి చెందింది. బంగారం కోసం ఆమె ప్రాణాలు తీసినట్లు అనుమానిస్తున్నామని, బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. తోటపేటలో మహాలక్ష్మి నివాసం ఉంటుంది. ఆమెకు భర్త మరణించాడు. దత్తత చేసుకున్న కుమార్తె నాగలక్ష్మి, అల్లుడు సలాది సురేష్‌లు కె.గంగవరం మండలం సత్యవాడలో ఉంటున్నారు. ఈ నెల 11న రాత్రి మహాలక్ష్మి మృతి చెందిన సమాచారాన్ని మరుసటి రోజు గుర్తించిన స్థానికులు కుమార్తె, అల్లుడులకు సమాచారం ఇవ్వడంతో వారు ఇంటికి చేరుకున్నారు. మహాలక్ష్మి చేతులు, కాళ్లు బిగుసుకుపోయిన స్థితిలో మంచంపైనే చనిపోయి ఉంది. అనంతరం ఆమె భౌతిక కాయాన్ని సమాధి చేశారు. అయితే ఆమె నిత్యం ధరించే 22 గ్రాముల బంగారు గొలుసు ఆమె ఒంటిపై లేకపోవడం గమనించారు. ద్రాక్షారామలోని శ్రీదేవి స్టీల్ హౌస్‌లో మహాలక్ష్మి పనిచేసేది. అక్కడ విచారణ చేయగా 11న ఆమె పనికి వచ్చినప్పుడు ఆ గొలుసు ఆమె ధరించి ఉందని తెలిసింది. దీంతో తోటపేటలో బంధువులకు చుట్టుపక్కల వారిని విషయం తెలియజేసి విచారణ చేయగా మృతురాలి ఇంటి సరిహద్దులో నివసించే నాగిరెడ్డి అప్పారావు ప్రవర్తనపై అనుమానం వచ్చింది. 13న ఉదయం నుంచీ అతడు డబ్బులు అధికంగా ఖర్చు పెడుతూ మద్యం తాగి తిరగడం, కోడి పందేలకు వెళ్లడం తదితర విషయాలు తెలిసింది. దీంతో అతడిపై అనుమానంతో మృతురాలి మెడలో ధరించిన గొలుసు ఫొటోతో పరిసరాల్లోని బంగారు తాకట్టు వ్యాపారస్తుల వద్ద విచారణ చేయగా ద్రాక్షారామలోని తేజా బంగారం షాపులో సదరు నాగిరెడ్డి అప్పారావు నాగిరెడ్డి బాబీ అనే పేరుతో 12న రూ. 40 వేలకు తాకట్టు పెట్టాడని, 13న వెలంపాలెం గ్రామానికి చెందిన ర్యాలి సురేష్ అనే వ్యక్తిని తీసుకు వచ్చి తాకట్టు వద్దు అతడి పేరుపైకి మార్చి మరో రూ. 50 వేలు తీసుకు వెళ్లాడని తెలిసింది. బంగారు గొలుసు కోసం తన అత్తయ్య ప్రాణం తీశారని అనుమానం ఉందని, అతడు ఒకడా.. ఇంకా ఉన్నారా.. అనేది పోలీసులు తగిన విచారణ చేసి తమకు న్యాయం చేయాలని మృతురాలి అల్లుడు సలాది సురేష్ ఫిర్యాదు చేశాడు. దీనిపై గురువారం రాత్రి కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం రామచంద్రపురం తహసీల్దార్ ఎం.సావిత్రి, వీఆర్వోలు, బంధువుల సమక్షంలో ద్రాక్షారామ శ్మశాన వాటికలో పూడ్చి పెట్టిన మృతదేహాన్ని తీయించి పంచనామా నిర్వహించారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

జెండర్ ఈక్వాలిటీ





ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి

# ఇంటింటా లక్ష్మీకళ

**ఆడపిల్ల పుడితే 'అయ్యో' అంటూ సానుభూతి చూపే వాళ్లు మన దేశంలో ఎన్నోచోట్ల కనిపిస్తారు. మధ్యప్రదేశ్‌లో ఈ ధోరణి మరీ ఎక్కువ. ఆడపిల్ల పుడితే ఆర్థికభారంగా భావించి పురిట్లోనే ప్రాణం తీసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మార్పు తేవడానికి మన తెలుగు బిడ్డ, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి 'లాడ్లీ లక్ష్మీ యోజన'తో నడుం బిగించారు. ప్రతిష్ఠాత్మకమైన 'బేటీ బచావో బేటీ పడావో' కు స్ఫూర్తిగా నిలిచిన ఈ సంక్షేమ పథకాన్ని పదిహేను రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి.**

కొన్ని సంవత్సరాల క్రితం...

కొందరు ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్. ఆడపిల్ల పుడితే భారంగా భావించడం నుంచి భ్రూణహత్యల వరకు ఎన్నో విషయాలపై మాట్లాడారు. ఆయన మాటల్లో ఎంతో ఆవేదన కనిపించింది.

'ఈ పరిస్థితుల్లో మనం మార్పు తేవాలి' అనే పట్టుదల కనిపించింది.

'మనం మాత్రం ఏం చేయగలం సర్, ప్రజలు అలా ఆలోచిస్తున్నారు!' అని ఆ అధికారులు చేతులెత్తేస్తే కథ కంచికి వెళ్లి నట్లే. అయితే కథ అక్కడితో ముగిసిపోలేదు. అక్కడినుంచే మొదలైంది.

ముఖ్యమంత్రితో సమావేశం అయిన వారిలో ఐఏయస్ అధికారి నరహరి కూడా ఉన్నారు. ఒక సమస్యకు పది రకాల పరిష్కార మార్గాలు ఆలోచించడం ఆయన సొంతం.

'మనం ఏం చేయలేమా!'... సీఎం ఆవేదనపూరిత మాటలు నరహరి మనసులో సుడులు తిరిగాయి.



'కచ్చితంగా చేయాల్సిందే. చేయగలం కూడా' అని ఒకటికి పదిసార్లు అనుకున్నారు.

పేదింటి బిడ్డ అయిన నరహరికి పేదోళ్ల కష్టాలు తెలియనివేమీ కాదు.

ఆడపిల్ల అంటే పనిగట్టుకొని వ్యతిరేకత లేకపోయినా పేదరికం వల్ల మాత్రమే 'ఆడబిడ్డ వద్దు' అనుకునే వాళ్లను ఎంతోమందిని చూశారు. ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడానికి హరియాణ, పంజాబ్... మొదలైన రాష్ట్రాల్లో ఎన్నో ప్రాంతాలు తిరిగారు. ఎన్నో కోణాలలో ఎన్నో ప్రశ్నలు వేశారు.

'మేం బతకడమే కష్టంగా ఉంది. ఇక ఆడబిడ్డను ఎలా బతికించుకోవాలి సారు' అనే మాటలను ఎన్నో ప్రాంతాలలో విన్నారు.

వారికి ఆర్థిక భరోసా ఇస్తే సమస్యకు పరిష్కారం దొరికినట్లే కదా! అలా మొదలైందే లాడ్లీ లక్ష్మీ యోజన(గారాల కూతురు). ఇది సంక్షేమ పథకం మాత్రమే కాదు... సామాజిక మార్పు తెచ్చిన శక్తి. ఆడపిల్ల భారం అనే భావన తొలగించేందుకు వారికి ముందు ఆర్థిక భరోసా కల్పించాలి. అదే సమయంలో అమ్మాయిలను విద్యావంతులను చేయాలి... ఈ కోణంలో పథకానికి రూపకల్పన చేశారు. 'పుట్టగానే అమ్మాయిని లక్షాధికారి చేస్తాం' అని ప్రకటించారు. అయితే ఆ డబ్బు చేతికందడానికి షరతులు విధించారు. అమ్మాయి ఇంటర్ పూర్తి చేయాలి. 5వ తరగతి పూర్తి చేస్తే రూ.2000, 8వ తరగతి పూర్తి చేస్తే రూ.4000 చొప్పున ప్రతి తరగతికి బోనస్ చెల్లింపులు చేశారు. అమ్మాయికి పద్దెనిమిది ఏళ్లు వచ్చాక మాత్రమే 'లాడ్లీ లక్ష్మీ యోజన' కు సంబంధించిన డబ్బులు చెల్లించేవారు. అలా పథకం వందశాతం విజయవంతమైంది.

### ఆడపిల్ల పుడితే రైఫిల్ లైసెన్స్!

మధ్యప్రదేశ్‌లోని చంబల్‌లోయ ప్రాంతాల్లో కొన్ని కులాల ప్రజలు రైఫిల్‌ను సామాజిక హోదాగా భావిస్తారు. మగవారు సైకిల్ మీద తిరిగినా భుజాన తుపాకీ ఉండాల్సిందే! ఆడపిల్లలను పురిట్లోనే చంపేసేవారు కూడా ఆ ప్రాంతాల్లో ఎక్కువే. ఆ ప్రాంతాలలో 'లాడ్లీ లక్ష్మీ యోజన' అంతగా ఫలితం ఇవ్వలేదు. దీంతో ప్రతి 1000 మంది బాలురకు 400 మంది బాలికలే మిగిలారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఆయా కులాల వారితో సమావేశం నిర్వహించారు. 'ఆడపిల్లలను మీరు వద్దనుకుంటూ పోతే వారే కాదు చివరికి మీ కులాలు త్వరలోనే అంతరించి పోవడం ఖాయం' అని కులపెద్దలకు చెప్పారు. దీంతో వారిలో మార్పు వచ్చింది. అయితే తమకు తుపాకీ లైసెన్స్ లేకుండా ఉండలేమన్నారు. దీంతో ఆడపిల్ల పుడితే రైఫిల్ లైసెన్స్ అని నిబంధన విధించారు!

2007 నుంచి 50 లక్షల మంది ఆడపిల్లలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. బాలికల లింగ నిష్పత్తి 400 నుంచి 950కి పెరిగింది. 'లాడ్లీ లక్ష్మీ యోజన' ద్వారా సామాజిక ఫలాలు అందుతున్న తీరును అధ్యయనం చేసి ఎంతోమంది పీహెచ్‌డీ చేశారు.

లింగ వివక్షకు తావు లేని సమాజాన్ని కల కంటున్నారు నరహరి. అది చారిత్రక అవసరం. తక్షణ అవసరం.

– భాషబోయిన అనిల్‌కుమార్,
సాక్షి ప్రతినిధి
కరీంనగర్

#### పేదింటి బిడ్డ

ఎంతోమంది ఆడపిల్లల జీవితాల్లో వెలుగులు నింపిన నరహరిది తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్. నిరుపేదింట జన్మించిన నరహరి కష్టపడి చదివి ఐఏఎస్ అయ్యారు. ప్రస్తుతం పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రిన్సిపల్ సెక్రటరీ హోదాలో ఉన్నారు. జన్మభూమికి ఏదైనా చేయాలనే ఆశయంతో 'ఆలయ ఫౌండేషన్' స్థాపించి స్థానికంగా విద్య, వైద్య, ఆరోగ్య సంబంధమైన సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు.

#### భ్రూణహత్యల నివారణకు...

'లాడ్లీ లక్ష్మీ యోజన' పథకం విజయవంతంగా అమలు చేస్తూనే మరోవైపు భ్రూణహత్యలపై దృష్టి సారించారు. ఇందుకోసం ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నర్సులు, కిందిస్థాయి సిబ్బందితో విస్తృతమైన విజిలెన్స్ నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు. తప్పుదారి పట్టిన వైద్యులపై కేసులు నమోదు చేశారు. దీంతో చట్టాన్ని ఉల్లంఘించిన వైద్యులు దారికొచ్చారు.

## సమాజ హితం కోసం...
# ప్రకృతికి దగ్గరగా




డాక్టర్ చెన్నమనేని పద్మ



పూజా రాథోడ్

'నా బిడ్డలు ఆరోగ్యంగా జీవించడానికి వారికి నేను ఇలాంటి భూగోళాన్ని ఇస్తున్నానా?' అని ఆవేదన చెందుతోంది పూజా రాథోడ్. ప్రకృతి మనకు అన్నీ ఇచ్చింది. సహజమైన వనరులతో ప్రకృతి సిద్ధంగా జీవించడానికి మనమెందుకు సిద్ధంగా ఉండడం లేదు... అని ప్రశ్నిస్తున్నారు డాక్టర్ చెన్నమనేని పద్మ. ఇద్దరి ఆవేదనలోని అంతర్యం ఒక్కటే. భూమి చల్లగా ఉంటే మన జీవితాలు ఆనందంగా గడుస్తాయని. భూమాతకు ఎదురవుతున్న పరీక్షలకు సమాధానంగా ఇద్దరూ అనుసరిస్తున్న మార్గం ఒక్కటే. ఒకరిది రాజస్థాన్ రాష్ట్రం, మరొకరిది తెలంగాణ. పర్యావరణం పట్ల వారికి ఉన్న స్పృహ ఒకరితో మరొకరికి పరిచయం లేకపోయినా, ఆలోచనలను పంచుకోకపోయినా... వారిని ఒక దారిలో నడిపిస్తున్నది మాత్రం భూమాత గురించిన శ్రద్ధ, ఆరోగ్యకరమైన జీవనం పట్ల ఆసక్తి మాత్రమే.





పూజారాథోడ్ చిత్రకారిణి. పటం మీద బొమ్మలు చిత్రిస్తారు. డాక్టర్ పద్మ ఇంటి అలంకరణ వస్తువులు, బొమ్మలు చేస్తారు. ఇద్దరూ తమ కళకు ముడిసరుకుగా ఉపయోగిస్తున్నది ప్రకృతి ప్రసాదాలను మాత్రమే. ఎర్ర మట్టి, రంపపు పొట్టు, మొక్కజొన్న పీచు, బొగ్గు, గోరింటాకు, ఆవు పేడ, గులకరాళ్లు, పూలు, వంటల్లో ఉపయోగించే పిండి... వీటికి పూజ క్రియేటివిటీ తోడైతే అద్భుతమైన వాల్ పెయింటింగ్ తయారవుతుంది. పద్మచేతిలో ఆవు పేడ గణపతి, లక్ష్మీదేవి రూపాలవుతుంది. పూజా రాథోడ్... జైపూర్‌లోని ఐఐఎస్‌యూలో విజువల్ ఆర్ట్స్‌లో పీజీ చేసి, 'స్టూడియో ద సాయిల్' పేరుతో ఆర్ట్ స్టూడియో స్థాపించింది. డాక్టర్ చెన్నమనేని పద్మ... హైదరాబాద్‌లోని వనిత మహావిద్యాలయలో తెలుగు ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యారు. తన విద్యార్థులకు ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను గమనించిన తర్వాత వాటి పరిష్కారం కోసం చేసిన అన్వేషణ ఇలా సహజ జీవనశైలి, జీవనశైలిలో ఆవు పాత్ర తెలిసి వచ్చాయంటున్నారు. ఒక మనిషి నిద్ర లేచిన తర్వాత పళ్లు తోముకోవడం నుంచి రాత్రి పడుకునే ముందు దోమలను పారదోలడానికి ఉపయోగించే మస్కిటో కాయిల్ వరకు రోజు మొత్తంలో ఉపయోగించే అనేక వస్తువులను గోమయం, గోమూత్రంతో తయారు చేసి చూపిస్తున్నారు. వాటి తయారీలో శిక్షణనిస్తున్నారు. ఫ్లోర్ క్లీనింగ్ లిక్విడ్, హ్యాండ్ మేడ్ సోప్స్, కీ హోల్డర్స్, ధూప్ స్టిక్స్, జపమాల, వాకిలి తోరణాలు... ఇలా రకరకాల వస్తువులు తయారు చేస్తోందామె. సస్టెయినబుల్ లైఫ్ స్టైల్ పట్ల సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి తన రిటైర్‌మెంట్ జీవితాన్ని అంకితం చేసినట్లు చెప్పారు పద్మ. ఆవును బతికించుకుంటే క్యాన్సర్ రహిత సమాజాన్ని సాధించవచ్చని నిరూపించాలనేది ఆమె ఆశయం. ఇందుకు ఆవును పెంచుకోమని బోధించడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించిన తర్వాత స్వయంగా రెండు వందల గోవుల సంరక్షణ బాధ్యతను స్వీకరించారు. అందుకోసం హైదరాబాద్ నగరాన్ని వదిలి జగిత్యాల జిల్లాలోని సొంతూరు బోర్నపల్లికి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు పద్మ. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం తన గ్రామం నుంచే మొదలుపెట్టారు.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

#### సహజ సిద్ధంగా...

ఆవు తనకు చేతులెత్తి మొక్కమని చెప్పదు. తనను ఉపయోగించుకుని ఆరోగ్యంగా జీవించమని కోరుతుంది. అందుకే ఆవును అమ్మతో సమానం అని చెబుతారు. ఆవుతో వచ్చే ఆరోగ్యం గురించి చెప్పడానికి మాటలు చాలవు. ఆవును ఎన్ని రకాలుగా మన దైనందిన జీవితంలో భాగం చేసుకోవచ్చో తెలియచేయడానికి నెలకు ఐదువందల రూపాయలకు ఒక కిట్ తయారు చేశాను. అందులో ఇంటిని శుభ్రం చేసుకునే క్లీనింగ్ మెటీరియల్ నుంచి దేహాన్ని శుభ్రం చేసుకునే వస్తువుల వరకు అన్నీ ఉన్నాయి. రసాయన రహితమైన, ప్రకృతి సహజమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం కోసం నా ప్రయత్నం కొనసాగుతోంది. క్యాన్సర్‌ను దూరంగా ఉంచాలంటే మనం ప్రకృతికి దగ్గరగా జీవించాలి. నేలను భద్రంగా ఉంచుకోవాలి. రసాయనాలతో నేల కాలుష్యం, నీరు కాలుష్యం కావడంతో మన దేహమూ కాలుష్య కాసారమవుతోంది. క్యాన్సర్‌కు ఆహ్వానం పలుకుతోంది. ఈ దుస్థితి నుంచి మనం బయటపడాలి.

– డాక్టర్ చెన్నమనేని పద్మ,
విశ్రాంత ఆచార్యులు, సామాజిక కార్యకర్త









## ● నగధగలు ఇంట్లోనే ఇలా మెరిపిద్దాం!



ఆభరణాలను ధరించే కొద్దీ మెరుపు తగ్గిపోతాయని అపోహ పడుతుంటాం. కానీ వాటి మెరుపు ఎక్కడికీ పోదు. రోజూ ధరించే బంగారు ఆభరణాలు గాలి, దుమ్ము, ధూళి, వాయు కాలుష్యం కారణంగా మసకబారుతుంటాయి. వాటికి మెరుగు పెట్టించాలనుకుని దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. నెలకోసారి ఇంట్లోనే శుభ్రం చేసుకోవచ్చు.

- ఒక పాత్ర (మెటల్ పాత్ర వాడరాదు, ప్లాస్టిక్ పాత్ర వాడాలి)లో డిష్ వాష్ లిక్విడ్ నాలుగు చుక్కలు వేసి గోరువెచ్చని నీటిని పోసి కలపాలి. ఆ తరవాత ఆభరణాలను నీటిలో మునిగేలా ఉంచి 15 నిమిషాల తర్వాత చేత్తో రుద్ది కడగాలి. ఆ తర్వాత మంచినీటి పాత్రలో పెట్టి వేళ్లతో మృదువుగా రుద్దుతూ సబ్బు వదిలేటట్లు శుభ్రం చేయాలి.
- నీటితో శుభ్రం చేసిన తర్వాత పేపర్‌తో తుడిచే ప్రయత్నం చేయరాదు. మెత్తటి కాటన్ వస్త్రాన్ని ఒత్తుగా నాలుగు మడతలు వేసి ఆభరణాన్ని ఉంచాలి. శుభ్రం చేసిన ఆభరణాన్ని బీరువాలో పెట్టాలంటే ఆభరణంలో ఏ మాత్రం తేమ లేకుండా ఆరిన తర్వాత మాత్రమే భద్రపరచాలి.
- ఆభరణాలను శుభ్రం చేసేటప్పుడు పాటించాల్సిన నియమం ఏమిటంటే... ఒక్కొక్క ఆభరణాన్ని విడిగా శుభ్రం చేయాలి. చెవికమ్మలు, రింగుల వంటి వాటిని కలిపి నానబెట్టి శుభ్రం చేసే అలవాటు చాలామందికి ఉంటుంది. కలిపి ఒకే పాత్రలో నానబెట్టాల్సి వస్తే అడుగు వెడల్పుగా ఉండి ఒక కమ్మ మరొక కమ్మకు తగలకుండా జాగ్రత్త తీసుకోవాలి. అలాగే కడిగేటప్పుడు కూడా ఒకదానికి మరొకటి తగులుతూ ఉంటే గీతలు పడతాయి.
- రాళ్లు పొదిగిన బంగారు ఆభరణాన్ని శుభ్రం చేయాలంటే నీటిలో నానబెట్టరాదు. మొదట సబ్బు నీటితో ముంచిన మెత్తని వస్త్రంతో ఆభరణాన్ని తుడవాలి. ఆ తర్వాత మంచినీటిలో ముంచిన క్లాత్‌తో తుడవాలి. తుడిచిన తర్వాత మెత్తటి టవల్ మీద ఆభరణాన్ని తలకిందులుగా (ఈ స్థితిలో ఆభరణంలో పొదిగిన రాయి కిందగా టవల్‌ను తాకుతూ ఉంటుంది. బంగారు పైకి కనిపిస్తుంటుంది) ఆరబెట్టాలి. ఇలా ఆరబెట్టడం వల్ల రాయికి బంగారానికి మధ్య తేమ చేరకుండా ఉంటుంది.



జియా నస్రీన్
జెమాలజిస్ట్

సోషల్ మీడియా

## బామ్మ కోసం...
# ఫ్లయింగ్ ఫ్రమ్ దుబాయి!





బామ్మతో జైనబ్ రోష్నా

జైనబ్ రోష్నా దుబాయిలో ఉంటుందన్న మాటేగానీ కేరళలోని బామ్మ జ్ఞాపకాలు ఎప్పుడూ తనతోనే ఉంటాయి. ఆ జ్ఞాపకాలు హాయిగా ఉంటాయి, నవ్విస్తాయి. కొన్నిసార్లు భావోద్వేగానికి గురి చేస్తాయి. తనకు తీరిక దొరికినప్పుడల్లా బామ్మతో ఫోన్‌లో మాట్లాడుతుంది జైనబ్.

'ఇలా ఫోన్‌లో మాట్లాడుకోవడమేనా! నన్ను చూడడానికి ఎప్పుడు వస్తావు?' అని అడుగుతుంది బామ్మ.

'నువ్వు దూరంగా ఉంటే కదా రావడానికి. నువ్వు ఎప్పుడూ నా కళ్ల ముందే ఉంటావు' అని నవ్వుతుంది జైనబ్.

'నీ మాటలకేంగానీ... నువ్వు నన్ను చూడడానికి రావాల్సిందే' అన్నది బామ్మ.

అటు నుంచి నవ్వు మాత్రమే వినిపించింది!

కట్ చేస్తే...

ఆ రోజు బామ్మగారి బర్త్‌డే. తన ఊళ్లో ఆ రోజు కూడా బామ్మ అన్ని రోజులలాగే ఎప్పటిలాగే ఉంది. 'నా బర్త్‌డేను జైనబ్ ఎంత ఘనంగా చేసేదో' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది.

ఇంతలో ఎవరో వస్తున్న అలికిడి వినిపించింది.

ఎవరా అని చూస్తే... ఊహించని వ్యక్తి.

'నిజమా? భ్రమా!' అనుకుంటుండగానే సంతోషంగా అరిచింది జైనబ్.

స్వీట్ షాక్ నుంచి తేరుకున్న తరువాత...

'నన్ను చూడడానికి వచ్చావా తల్లీ... ఒక్క మాటైనా చెప్పలేదు...' అంటూ సంతోషంతో కళ్ల నీళ్ల పెట్టుకుంది బామ్మ.

'ముందే చెబితే ఏం మజా ఉంటుంది! ఇలా వస్తేనే సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది' అన్నది జైనబ్.

ఆ రోజు వంద పండగలు ఒకేసారి వచ్చినంత సంతోషంగా ఫీల్ అయింది బామ్మ. ప్రేమగా, గారాబంగా మనవరాలిని ముద్దు పెట్టుకుంది.

'గత ఏడాది మా అమ్మమ్మ పుట్టిన రోజున నా ఎమిరేట్స్ యూనిఫాం ధరించి వీడియో కాల్ చేశాను. నన్ను యూనిఫాంలో చూసి అమ్మమ్మ ఆశ్చర్యపడింది. కొత్త అమ్మాయిని చూసినట్లుగా ఉంది అని నవ్వింది. ఈ పుట్టిన రోజుకు మరింత సర్‌ప్రైజ్ ఇవ్వాలనుకున్నాను. అందుకే చెప్పకుండా వచ్చాను' అని ఇన్‌స్టా పోస్ట్‌లో రాసింది జైనబ్.

ఒక్క మాటలో చెప్పాలంటే... ఇది మామూలు సంఘటన. అయితే సోషల్ మీడియాలో బామ్మ, మనవరాళ్ల వీడియో ఎంతో సందడి చేస్తోంది. దుబాయి నుంచి వచ్చిన జైనబ్ బామ్మ గదిలోకి సంతోషంగా పరుగెత్తుతున్న దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి.

జైనబ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో క్లిప్ 2.3 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

ఈ వీడియో క్లిప్ నేపథ్యంలో అమ్మమ్మ, నానమ్మలతో తమకు ఉన్న విలువైన జ్ఞాపకాలు పంచుకున్నారు నెటిజనులు.

'అమ్మ దగ్గర కంటే అమ్మమ్మ దగ్గరే నాకు చనువు ఎక్కువ. ఈ వీడియో క్లిప్ చూసినప్పుడు మా అమ్మమ్మ గుర్తుకు వచ్చి కళ్లలో నీళ్లు తిరిగాయి. పెద్దవాళ్లు మన నుంచి ఏమీ కోరుకోరు. మనం వారికి ఒకసారి కనిపించినా పెద్ద బహుమతిగా ఫీలవుతారు' అని స్నేహ అనే నెటిజన్ తన కామెంట్ పోస్ట్ చేసింది.

**సోషల్ మీడియాలో ఈ బామ్మ, మనవరాళ్ల వీడియో ఎంతో సందడి చేస్తోంది. దుబాయి నుంచి వచ్చిన జైనబ్ బామ్మ గదిలోకి సంతోషంగా పరుగెత్తుతున్న దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి. జైనబ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో క్లిప్ 2.3 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.**

# హెల్దీ లంచ్ బాక్స్

వంటిల్లు

**స్కూలుకెళ్లే పిల్లలున్న ఇంటి కళ వేరు. డ్రాయింగ్ రూమ్‌లో స్కూలు బ్యాగ్‌లు. వంటగదిలో లంచ్ బాక్సులు పలకరిస్తాయి. ఆ వంటింటి మెనూ భిన్నంగా ఉంటుంది. రోజూ కొత్తగా వండాలి... హెల్దీగా ఉండాలి. ఆ తల్లికి వంట రోజూ ఓ మేధోమథనమే. వారంలో ఓ రోజు ఇలా ట్రై చేయండి.**

## పనీర్ బటర్ మసాలా



**కావలసినవి:** పనీర్ ముక్కలు– ఒకటిన్నర కప్పు; **ఉల్లిపాయ ముక్కలు** – ముప్పావు కప్పు; **టొమాటో ముక్కలు**– కప్పు; **వెల్లుల్లి రేకలు**– 4; **అల్లం తురుము** – టీ స్పూన్; **పచ్చిమిర్చి**– 2; **జీడిపప్పు**– పది పలుకులు; **పాలు**– అర కప్పు; **మీగడ** – పావు కప్పు; **కసూరీ మేథీ లేదా తాజా మెంతి ఆకు** – టీ స్పూన్; **ధనియాల పొడి**– టీ స్పూన్; **మిరప్పొడి**– టీ స్పూన్; **పసుపు** – పావు టీ స్పూన్; **వెన్న** – 2 టీ స్పూన్‌లు; **ఉప్పు** – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; **కొత్తిమీర తరుగు**– 3 టేబుల్ స్పూన్‌లు.

**పోపు కోసం...** **నూనె** – టేబుల్ స్పూన్; **యాలకులు** – 2; **లవంగం** – 1; **దాల్చిన చెక్క** – అంగుళం ముక్క;

**తయారీ:** ● పనీర్ ముక్కలను వేడి నీటిలో వేసి మెత్తబడే వరకు పక్కన ఉంచాలి. ● బాణలిలో నూనె వేడి చేసి మీగడ, వెల్లుల్లి, అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, జీడిపప్పు వేసి ఒక మోస్తరుగా వేయించాలి. వీటిని ఒక ప్లేట్‌లోకి తీసుకుని అదే బాణలిలో మిగిలిన నూనెలో లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క వేయించాలి. ఆ తర్వాత మిరప్పొడి, ధనియాల పొడి, పసుపు, మేథీ వేసి పచ్చిదనం పోయే వరకు వేయించాలి. ● ఉల్లిపాయ, టొమాటో ముక్కలు, జీడిపప్పు చల్లారిన తర్వాత మిక్సీలో గ్రైండ్ చేసి ఆ మిశ్రమాన్ని బాణలిలో వేయాలి. అందులో పాలు పోసి, ఉప్పు వేసి కలిపి చిక్కదనం, రుచి చూసుకోవాలి. మిశ్రమం ఉడకడం మొదలై బుడగలు రావడం మొదలైన తర్వాత పనీర్ ముక్కలను నీటిలో నుంచి తీసి బాణలిలో వేసి కలపాలి. మంట తగ్గించి, వెన్న వేసి, కొత్తిమీర చల్లి స్టవ్ ఆపేయాలి.

## పీస్ పులావ్



**కావలసినవి:** బాసుమతి బియ్యం – కప్పు; **పచ్చి బఠాణీ**– పావు కప్పు; **నీరు** – 3 కప్పులు; **బిర్యానీ ఆకు** – ఒకటి; **యాలక్కాయ** – 1; **లవంగం** – 1; **దాల్చిన చెక్క** – అర అంగుళం ముక్క; **ఉప్పు** – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; **నిమ్మరసం** – అర టీ స్పూన్.

**పోపు కోసం...** **నెయ్యి**– 2 టేబుల్ స్పూన్‌లు; **పచ్చిమిర్చి**– 1 (నిలువుగా చీరాలి); **షాజీరా**– టీ స్పూన్.

**తయారీ:** ● బియ్యాన్ని కడిగి పది నిమిషాల సేపు మంచినీటిలో నానబెట్టాలి. బఠాణీలను కడిగి పక్కన పెట్టాలి. ● నీటిని ఒక పాత్రలో మరిగించాలి. నీరు మరగడం మొదలైన తర్వాత అందులో బఠాణీలు, బియ్యం వేయాలి. బియ్యం ఉడికేటప్పుడే నిమ్మరసం, యాలక్కాయ, లవంగం, దాల్చిన చెక్క, బిర్యానీ ఆకు, ఉప్పు వేయాలి. అన్నం ఉడుకుతున్నప్పుడే మరో స్టవ్ మీద ఒక పాత్ర పెట్టి అందులో నెయ్యి వేడి చేసి పచ్చిమిర్చి, షాజీరా వేసి వేగిన తర్వాత ఉడుకుతున్న అన్నంలో వేసి అన్నం మెతుకులు విరగకుండా జాగ్రత్తగా కలిపి మూత పెట్టాలి. మంట తగ్గించి నీరు ఇంకి పోయిన తర్వాత దించేయాలి.

**గమనిక:** ఎండు బఠాణీలైతే రాత్రంతా నానబెట్టాలి.